క్లుప్తంగా

నేడు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి రాక

కమలాపురం: మండల పరిధిలోని పందిళ్లపల్లె గ్రామంలో వెలసిన బోగాదమ్మ అమ్మవారి ఆలయానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి హాజరు కానున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన బోగాదమ్మ ఆలం ప్రతిష్ట మహోత్సవాలకు శనివారం ఎంపీ హాజరు కానున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన కోరారు.

పూర్వ విద్యార్థుల దాతృత్వం


పాఠశాలకు డెస్కులు అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

తొండూరు : మండల కేంద్రంలోని తొండూరు ఉన్నత పాఠశాలలో 1983–84 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు దాతృత్వాన్ని చాటుకున్నారు. పాఠశాల విద్యార్థులు కూర్చోవడానికి అవసరమైన 36 డెస్కులను సమకూర్చారు. గత నెలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల పురోగాభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో శుక్రవారం లక్ష రూపాయల విలువైన డెస్కులు అందించారు. పూర్వవిద్యార్థులు పాఠశాలకు వచ్చి ప్రధానోపాధ్యాయుడు కె. వి. సుబ్బారెడ్డి, సిబ్బందికి డెస్కులను అప్పగించారు. పూర్వ విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించి, ధన్యవాదాలు తెలిపారు.

ఆత్మవిశ్వాసంతో లక్ష్య సాధన


మాట్లాడుతున్న రామ్‌లక్ష్మణ్

పులివెందుల టౌన్ : ఆత్మవిశ్వాసంతో అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు రామ్‌లక్ష్మణ్‌రెడ్డి, రాఘవేంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం సాయి చైతన్య జూనియర్ కాలేజీలో విద్యార్థులకు మనో ధైర్యం నింపడం కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విద్యార్థులు ఏ సమస్యనైనా మనోధైర్యంతో ఎదుర్కోవాలని, మానసిక ఆందోళనకు గురై ఆత్మహత్యలకు పాల్పడడం సరికాదని పేర్కొన్నారు. మానసిక ఒత్తిళ్లను తగ్గించుకోవడానికి, జ్ఞాపకశక్తిని పెంపొందించుకోవడానికి మార్గాలను సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న అధికారులు

వేంపల్లె: మండలంలోని పాపాఘ్ని నది అవతల ఉన్న ఎద్దుల కొండ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేసినట్లు ఆలయ ఈఓ విశ్వనాథ్‌రెడ్డి పంచాయితీ రాజ్ శాఖ డీఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎద్దులు కొండపైకి తారు రోడ్డు వేసేందుకు ఈఏపీ గ్రాంట్ ద్వారా రూ1.1.9 కోట్లు నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. గతంలో వేసిన రోడ్డు దెబ్బతినడంతో భక్తులు ఇబ్బందులు పడకుండా కొత్తగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో అర్చకులు హరి ప్రవీణ్, రమణ, ఎద్దుల కొండ్రాయుడు, అధికారులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

పులివెందుల టౌన్ : స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని శుక్రవారం ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. భోజనం రుచిగా శుచిగా ఉంటుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం భోజనం పెట్టాలని భోజన ఏజెన్సీ వాళ్లకు సూచించారు. విద్యార్థులకు సకాలంలో భోజనం పెట్టకపోయినా, మెను పాటించకపోయినా తగు చర్యలు తప్పవని హెచ్చరించారు.

రేపు శోభా యాత్ర

కడప రూరల్: ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా ఆదివారం కడప నగరంలో శోభా యాత్ర నిర్వహిస్తున్నామని ఛత్రపతి శివాజీ మరాఠా సేవా సంఘ్ ఐక్య వేదిక గౌరవాధ్యక్షులు ఏ. వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ శోభాయాత్రను జయప్రదం చేయాలని కోరారు.

శనగ.. శ్రమే మిగలగ..!

శనగపంటపై రైతులు పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యాయి. తుపాను కారణంగా పంట దెబ్బతినడం, దీనికి తోడు తెగుళ్లు సోకడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. అరకొరగా వచ్చిన దిగుబడికి గిట్టుబాటు ధర లభించడం లేదు. ఫలితంగా రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

- పంట చేతికొచ్చాక పతనమైన ధర
- ప్రారంభం కాని కొనుగోళ్లు
- దళారుల చేతివాటం
- గిట్టుబాటు కాక నష్టపోతున్న రైతులు


అమ్మకానికి సిద్ధంగా ఉన్న శనగలు

ఎర్రగుంట్ల : పంట చేతికొచ్చింది. పంటను చూసి మురిసిపోతూ మార్కెట్‌కు తీసుకెళితే ధర పతనమైంది. రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు. ఇదీ ఎర్రగుంట్ల మండలంలోని పప్పుశనగ సాగుచేసిన రైతుల దీనావస్థ. పప్పుశనగ పంట సాగుతో నష్టపోయాం.. దిగుబడి తక్కువ ఖర్చులు ఎక్కువ కావడంతో అప్పుల పాలయ్యామని అన్నదాత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో పప్పుశనగర ధర కూడా అంతంత మాత్రమే ఉంది. ఎర్రగుంట్ల మండల మార్కెట్ యార్డు వ్యవసాయ పరిధిలో మండలాల్లో ఇంకా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. కనీసం పెట్టుబడి, కూలీలు ఖర్చులు కూడా రాలేదని రైతులు ఆవేదన చేస్తున్నారు. బయట మార్కెట్‌లో క్వింటాళ్లు రూ.5,000 ధర పలుకోతుంది.

వెంటాడిన తుఫాన్, వాతావరణం

డిసెంబరు వరకు పంట బాగా ఎదిగింది. దిగుబడి ఆశాజనకంగా వస్తుందని అన్నదాతలు ఆశించారు. అయితే డిసెంబరు 2వ వారంలో తుఫాన్ ప్రభావంతో పంట దెబ్బతింది. ఇందుకు వాతా వరణం కూడా అనుకూలించక పోవడంతో వేరుకుళ్లు, ఎండు తెగుళ్లు బారన పడి పంటంతా ఎర్రబారింది. పంట పూర్తిగా దెబ్బతినడంతో తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తగ్గిన దిగుబడి

మండల వ్యాప్తంగా సుమారు 4,600 హెక్టార్లలో పప్పుశనగ సాగు చేశారు. ఎకరాకు 3 నుంచి 5 లోపు దిగుబడి వస్తుందని రైతులు తెలియజేశారు. దిగుబడి తగ్గడంతో సాగు ఖర్చులు కూడా రాలేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలని కోరుతున్నారు. దిగుబడి లేక పోవడంతో నష్టపోయామని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వం విఫలం



శనగలను విక్రయించేందుకు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులు, దళారులను ఆశ్రయిస్తున్నారు. నాణ్యత పేరుతో దళారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. విత్తన సాగు సమయంలో ప్రభుత్వం సబ్సిడీ పోను క్వింటా రూ.7,050 రైతుల వద్ద నుంచి తీసుకున్నారు. ఇప్పుడు అరకొర దిగుబడి వచ్చింది. ఇంత వరకూ రైతు భరోసా కూటమి ప్రభుత్వం రైతులు ఇవ్వలేదు. రైతులను ప్రభుత్వం విఫలమైంది.

–మల్లు వెంకటమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ, రైతు, ఎర్రగుంట్ల మండలం

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం



మండలంలో శనగ పంటను ఆలస్యంగా సాగు చేయడం వలన ఇప్పటికీ పంట నూర్పిళ్లు కొనసాగుతున్నాయి. త్వరలోనే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. ఎకరాకు 3 నుంచి 5 క్వింటాళ్లు లోపు దిగుబడి వచ్చింది. తుపాను వలన రైతులు నష్టపోయారు. ప్రభుత్వానికి నివేదిక పంపుతాం.

–శ్రీకాంత్‌రెడ్డి, వ్యవసాయాధికారి, ఎర్రగుంట్ల మండలం

భూసేకరణకు రైతులు సహకరించాలి


రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ సాయిశ్రీ

ముద్దనూరు: ముద్దనూరు–తాడిపత్రి జాతీయ రహదారి నిర్మాణంలో భూసేకరణకు రైతులు సహకరించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి సాయిశ్రీ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ సమస్యలు లేని ప్రాంతాల్లో భూసేకరణ త్వరగా పూర్తిచేయాలని, మిగిలిన రైతులు తమ బ్యాంకు ఖాతా తదితర వివరాలు అందిస్తే వెంటనే పరిహారం జమ అవుతుందని తెలిపారు. చింతకుంట సమీపంలో గాలేరు–నగరి కాలువ మీదుగా రైతుల పొలాల్లోకి వంతెన నిర్మించి తమ భూములను కాపాడాలని పలువురు రైతులు కోరారు. తహసీల్దారు కిషోర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ


డ్రైవర్లుకు అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ ప్రసాద్

పులివెందుల రూరల్: అప్రమత్తతతోనే ప్రమాదాలను నివారించవచ్చని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ అన్నారు. 36వ జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని ముద్దనూరురోడ్డు సమీపంలో ఉన్న మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో డ్రైవర్లుకు, పాఠశాలలకు సంబంధించిన బస్సు డ్రైవర్లుకు, వాహనాదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. వాహనాదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని పేర్కొన్నారు.

దోమలతో వ్యాధుల విస్తరణ


మాట్లాడుతున్న జోనల్ మలేరియా అధికారి లక్ష్మీనాయక్

ఎర్రగుంట్ల : జ్వరాలు విస్తరణకు దోమలే కారణమని జోనల్ మలేరియా అధికారి లక్ష్మీనాయక్ అన్నారు. శుక్రవారం ఎర్రగుంట్ల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రులను తనిఖీ చేశారు. అనంతరం వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే దోమలు వృద్ధి చెందుతాయని వాటి వలన మలేరియా, డెంగీ జ్వరాలు వ్యాపిస్తాయని తెలిపారు. ప్రతిఒక్కరూ దోమ తెరలు వాడాలని, శుక్రవారం డ్రైడేను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, డాక్టరు జోత్స్న, యూనిట్ అధికారి లక్షుమయ్య, ఎంపీహెచ్ఓ రవి శంకర్‌రాజు, సూపర్‌వైజర్ ఓబులేసు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పులివెందుల రూరల్: పులివెందుల పట్టణంలోని 33–11కేవీ సబ్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రి ఫీడర్ పరిధిలో విద్యుత్ వైర్లకు అల్లుకున్న చెట్లను తొలగింపు కారణంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ జగదీశ్వరరెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏఈ ప్రియదర్శన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముద్దనూరు రోడ్డు, రాణీవనం , కడపరోడ్డు, వేంపల్లి రోడ్డు వినాయకనగర్, సుందరయ్య నగర్, ప్రొద్దుటూరు రోడ్డు, ఎస్టేట్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

క్షయ వ్యాధిని నిర్మూలిద్దాం


మాట్లాడుతున్న డాక్టర్ జోత్స్న

ఎర్రగుంట్ల : క్షయ వ్యాధిను నిర్మూలిద్దామని ఎర్రగుంట్ల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ జోత్స్న పిలుపునిచ్చారు. శుక్రవారం జువారి సిమెంట్ ఫ్యాక్టరీ ఆసుపత్రిలో క్షయ వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల ఉద్యోగులు దుమ్ము, ధూళిల మధ్య పనిచేస్తూ ఉంటారని, అందువల్ల గల్ల పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. సాధారణంగా సిమెంట్ కర్మాగారాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగులకు దుమ్ము, ధూళితో దగ్గు, ఆయాసం వస్తాయన్నారు. అందుకే ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన గల్ల పరీక్ష చేయించుకోవాలని, వ్యాధి నిర్ధారణ అయితే మందులు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జువారి సిమెంట్ ఫ్యాక్టరీ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ నరసింహారెడ్డి, డాక్టర్ శ్రీలత, సూపర్‌వైజర్ ఓబులేసు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి


హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

వేంపల్లె : రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని వేంపల్లె ఎస్ఐ తిరుపాల్ నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో వాహనదారులకు హెల్మెట్ వాడకంపై ఎస్ఐ అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు తప్పనిసరిగా వాడాలని సూచించారు. హెల్మెట్ ధరించకుండా పోవడంతో చాలా మంది ప్రమాదాలకు గురయి ప్రాణాలు కోల్పోతున్నారని, శరీర అంగవైకల్యాలకు గురవుతున్నారని తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ రూల్స్ ఖచ్చితంగా పాటించాలని సూచించారు. అంతేకాకుండా వాహనాలకు సంబంధించి రికార్డులు, లైసెన్సు తప్పనిసరి కలిగి ఉండాలన్నారు.

విద్యార్థినులకు కంటి అద్దాలు పంపిణీ


విద్యార్థినులకు కంటి అద్దాలు అందజేస్తున్న వైద్యాధికారి సుధాకర్

పులివెందుల టౌన్ : స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు శుక్రవారం ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నేత్ర వైద్యాధికారి సుధాకర్ ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థినిలకు గతంలో కంటి పరీక్షలు నిర్వహించి దృష్టి లోపం ఉన్న వారిని గుర్తించారు. శుక్రవారం విద్యార్థినులకు జిల్లా అంధత్వ నివారణ సంస్థ వారి సహకారంతో బాకరాపురం పట్టణ ప్రాథమిక వైద్యాశాల వైద్యుడు డాక్టర్ శాంతకుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగిరెడ్డి, నేత్ర వైద్యాధికారి సుధాకర్ రెడ్డి, స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షులు రాజుల చేతులమీదుగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దృష్టిలోపం ఉన్న ప్రతి విద్యార్థి పౌష్టికాహారం తీసుకువాలని సూచించారు. విద్యలో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం మేరీ మంజుల, ఆశా కార్యకర్త మేరీ పద్మజ, నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు వైద్య నిపుణుల రాక

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని డాక్టర్ ఈసీ గంగిరెడ్డి ఆసుపత్రి(దినేష్ మెడికల్ సెంటర్)లో ఆదివారం నరాల, గుండె జబ్బులు, క్యాన్సర్ వ్యాధి వైద్య నిపుణులు వస్తున్నట్లు ఆసుపత్రి డాక్టర్ ఈసీ దినేష్‌రెడ్డి తెలిపారు. న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతికుమార్ మెదడు, వెన్నముక, నరాలు, తిమ్మిర్లు, ఒళ్లనొప్పులకు చికిత్స అందిస్తారని తెలిపారు. ఆదివారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం వరకు అందుబాటులో ఉంటారు. అలాగే ప్రముఖ గుండెజబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి, ప్రముఖ క్యాన్సర్ వ్యాధి నిపుణులు డాక్టర్ నిహారికలు మధ్యాహ్నం నుంచి అందుబాటులో ఉంటారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

జమ్మలమడుగు: మహాత్మాజ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2025–2026 ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5వ తరగతి ప్రవేశం, బ్యాక్‌లాక్ అడ్మిషన్లు ఇంగ్లీషు మీడియంలో ప్రవేశం కోసం బాల,బాలికలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశం లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసి మార్చి 15వ తేది లోపు పాఠశాలల్లో సమర్పించాలని సూచించారు.

వీర జవాన్లను స్మరించుకుందాం


ర్యాలీ నిర్వహిస్తున్న జవాన్లు, విద్యార్థులు

పులివెందుల టౌన్ : పుల్వామా వీర జవాన్ల త్యాగాలను స్మరించుకుందామని ఆర్మీ జవాన్ ఉత్తమ్‌కుమార్ అన్నారు. పుల్వామా వీర జవాన్ల త్యాగాలను స్మరించుకుంటూ పులివెందులలో విద్యార్థులు, విశ్రాంత ఆర్మీ జవాన్లు, సర్వీస్‌లో ఉన్న ఆర్మీ జవాన్లు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్మీ జవాన్ ఉత్తమ్‌కుమార్ మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ఎంతో మంది జవాన్లు తమ ప్రాణాలను త్యాగం చేస్తున్నారని కొనియాడారు. పులివెందుల పూల అంగళ్ల కూడలి వద్ద వీర మరణం పొందిన జవాన్లకు నివాళులు అర్పించారు.

రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి


రక్తదానం చేస్తున్న యువకుడు

వేంపల్లె: రక్తదానం చేసి ప్రాణ దాతలు కావాలని ఆర్కే వ్యాలీ ట్రిబుల్ ఐటీ డైరెక్టర్ ఏఎస్ఎస్ కుమార్ స్వామి గుప్తా అన్నారు. శుక్రవారం ఆర్కే వ్యాలీలో క్యాంపస్‌లో వీర సైనికుల త్యాగానికి గుర్తుగా రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని పేర్కొన్నారు. రక్తదానం చేయడంలో భాగస్వాములు కావాలని కోరారు. రక్తనిధి మెడికల్ ఆఫీసర్ భార్గవ్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం


నిల్వ నీటిని పారబోస్తున్న సిద్ధయ్య, ఆరోగ్య కార్యకర్తలు

తొండూరు: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చని మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య తెలిపారు. మండలంలోని నింతకోవ్వూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర పరిధిలోని పాలూరులో ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు ప్రతి గ్రామాన్ని సందర్శించి జ్వరంతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు చేయాలని సూచించారు. ప్రతి శుక్రవారం తప్పని సరిగా డ్రైడే పాటించాలన్నారు. ఎవరికైనా జ్వరం వస్తే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించు కోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు శ్రీలక్ష్మి, రమణ, మేరి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఆ సంఘంతో సంబంధం లేదు

ప్రొద్దుటూరు : ఆంధ్ర ప్రదేశ్ దేవాంగ సంక్షేమ సంఘంతో ఎలాంటి సంబంధం లేదని ది ప్రొద్దుటూరు దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వుట్టి నాగశయనం పేర్కొన్నారు. దేవాంగ కల్యాణ మండపంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది డిసెంబర్ 8న రాజమండ్రిలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం సమన్వయ సమావేశం అని ప్రచారం చేశారన్నారు. కార్యవర్గ సభ్యులతో ఎలాంటి సంప్రదింపులు జరపకుండా, పాలక వర్గాన్ని రద్దు చేయకుండా రాష్ట్ర అధ్యక్షుడిగా సుబ్రహ్మణ్యేశ్వరరావు, కార్యదర్శిగా మాడిశెట్టి శివశంకరయ్యలను ఎన్నుకున్నారన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన ది ప్రొద్దుటూరు దేవాంగ సంక్షేమ సంఘంతో సంప్రదింపులు జరపకుండా ఈ నెల 16న జరిగే ప్రమాణ స్వీకారానికి గౌరవ అతిథులుగా ప్రచురించారన్నారు. తమకు తెలియకుండా సంఘం పేరును వాడుకోవడం దారుణమన్నారు. దేవాంగ కల్యాణ మండపం అధ్యక్షుడు రెడ్డి చంద్రశేఖర సుబ్రహ్మణ్యం, కార్యదర్శి మచ్చా వెంకటసుబ్బరాయుడు, కోశాధికారి వెంకటచలపతి, దేవాంగ సంక్షేమ సంఘం సెక్రటరీ గిద్దలూరు ఈశ్వరయ్య, కోశాధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

హెల్మెట్ భారం కాదు ... భరోసా

బద్వేలు అర్బన్ : హెల్మెట్ భారం కాదు ... భరోసా అని, ఇందుకోసం ప్రతి ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించి నిండు జీవితాన్ని కాపాడుకోవాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి.శేఖర్‌రావు, బద్వేలు అర్బన్ ఎస్ఐ ఎం.సత్యనారాయణ పేర్కొన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ఎంవీఐ కార్యాలయం నుండి సిద్ధవటం రోడ్డు, మైదుకూరు రోడ్డు, నెల్లూరు రోడ్డుల మీదుగా పట్టణంలో హెల్మెట్‌లు ధరించి బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంవీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో అధిక శాతం యువత ప్రాణాలు కోల్పోతున్నారని, ఇందుకు కారణం వాహనాలను నడిపే సమయంలో హెల్మెట్ ధరించకపోవడమే అన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో తలకు గాయం కాకపోతే సాధ్యమైనంత వరకు ప్రాణాపాయం తప్పుతుందని చెప్పారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడపడం వలన సురక్షితంగా గమ్యం చేరుకోవచ్చనే విషయాన్ని ప్రతి వాహనదారుడు గుర్తించుకోవాలని పేర్కొన్నారు. అలాగే అతి వేగం కూడా ప్రమాదాలకు మూలకారణమని, దీనిని నియంత్రించుకోవాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. ముఖ్యంగా సెల్‌ఫోన్ డ్రైవింగ్‌కు స్వస్తి పలికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని కోరారు. అప్రమత్తతతోనే ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. వాహనాలకు సంబంధించి రికార్డులు, లైసెన్సు తప్పనిసరి కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంవీఐ కార్యాలయ సిబ్బంది, వివిధ ద్విచక్ర వాహన షోరూమ్‌ల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా విగ్రహ ప్రతిష్ట


గ్రామోత్సవంలో సీతారాముల విగ్రహాలు


నాగ శిలల గ్రామోత్సవం

తొండూరు : తొండూరు మండలంలోని అగడూరు గ్రామంలో శ్రీసీతారామలక్షణ హనుమత్ దేవత విగ్రహ ప్రతిష్ట మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం అగుడూరు గ్రామ ప్రజల ఆధ్వర్యంలో అర్చకులు శ్రీధర్ వెంకటరమణశాస్త్రి, ప్రేమ కుమార్ శర్మ ఆధ్వర్యంలో ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచే గ్రామ ప్రజలు ఆలయం వద్దకు చేరుకొని చతుర్వేద పూజ, మూల మంత్ర జపము, వేద పారాయణము రుద్రాభిషేకము, రుద్ర హోమము, సుదర్శన హోమము, మూలమంత్ర జప హోమములు, గ్రామ బలిహారము నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి శ్రీ సీతారామ లక్షణ హనుమత్ గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామహోత్సవంలో ప్రజలందరూ పాల్గొని కాయ కర్పూరం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గ్రామోత్సవంలో సింహాద్రిపురానికి చెందిన శివశంకర్ కోలాట బృందం ప్రదర్శన ఆకట్టుకుంది.

నేడు బండలాగుడు పోటీలు

శ్రీ సీతారామ లక్ష్మణ హనుమత్ విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా శనివారం రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. గెలుపొందిన వృషభాలకు మొదటి బహుమతి లక్ష రూపాయలను కుప్పల శివ శంకర్ రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి అందజేయనున్నారు. అలాగే రెండో బహుమతి రూ.80వేలు పుచ్చ రామాంజనేయరెడ్డి, మూడవ బహుమతి రూ.60వేలు గౌతమ్ రెడ్డి సాంబశివరెడ్డి అందజేయనున్నారు.